వుల్ఫ్‌డీట్రిఖ్ ష్నూర్రే

# 11. అపశ్రుతి

ఆగస్టు 1959.

వాల్టర్ కోసం ఎదురుచూస్తూ ఆమె గవాక్షంవద్ద నిలబడి ఉన్నది. చీకటి. మార్క్స్-ఎంగెల్స్ ప్లాట్జ్ నుంచి సిమెంటుధూళివాసనా, డీజెల్ ఆయిలు వాసనా వస్తున్నది. ఆవిరి పొగమంచులాగా కప్పిన స్ప్రీ నది ఆమెకు దిగువనే ఉన్నది; బెర్గ్‌స్ట్రాస్ వీధిలోని కొద్దిపాటి దీపాల ప్రతిబింబాలు అందులో మిలమిలలాడుతున్నాయి.

అతనికొక ఉత్తరం రాసి బల్లమీద పెట్టి వెళ్ళిపోయినా సరిపోయేదే. అతనామెను అర్థం చేసుకోలేదని కాదు, బాగానే అర్థం చేసుకున్నాడు. కాని ఇప్పుడర్థం చేసుకుని చేసేది లేదు. మనసుల్లో కలిగే ఆలోచనలు ముఖ్యం కాదు, హృదయంలో కలిగే భావమే ముఖ్యమేమో. కాని, ఆమెను వెళ్ళగొట్టుతున్నదేదైతే ఉందో దాన్నే అతని హృదయం అంటిపెట్టుకున్నది. అలాటప్పుడామె ఇక ఆశించగలిగిన దేమిటి ?

ఇప్పటికి దాదాపు ఇరవైయేళ్ళుగా తాము కలిసి జీవిస్తున్నారు. అదే ఆమెను పట్టుకుని ఉన్న ఆశ. నిజానికి కలిసి జీవించడమన్నదానికి అర్థమేమిటి? ఉదయం లేచినది లగాయతు సాయంకాలం దాకా అతను ఆ అచ్చాఫీసులో ఉంటాడు, ఆ మీదట కుప్‌ఫెర్‌గ్రాబెన్‌కుగాని, స్ప్రీలోగాని చేపలు పట్టడానికి పోతాడు, తాను పూర్తిగా పదిగంటలపాటు హాలో సర్వింగ్ చేస్తుంది. అయినప్పటికీ, ఒకరికొకరు ఆధారంగా ఉంటున్నారు, రాత్రివేళ ఒకరిపక్కన మరొకరు ఊపిరి తీయడం వినపడుతుంది, ఒక్కొక్క ఆదివారం ఇద్దరూ కలిసి ప్లెంటెర్‌వాల్డ్‌కు

గాని, ముగ్గెల్సీకిగాని పోవడంకూడా కద్దు. ఇదంతా ఇద్దరిమధ్యా బంధమే గద. 1945 ఆ సైనికుడి బెడద వచ్చినప్పుడు తనకు డాక్టరుచేత గర్భస్రావం చేయించాలని వాల్టర్ పట్టుబట్టడంతో ఆమెకు పరాయివాడి బిడ్డా, సొంతబిడ్డా కూడా లేకుండా పోబట్టిగాని, తమ యిద్దరిమధ్యా మరింత దృఢమైన బంధమే ఉండును.

ఆమెకు కుడివైపున దూరంగా, స్ప్రీ ఒడ్డు వెంబడే, దేదీప్యమానంగా వెలుగుతూ కంబళిపురుగులాగా ఉన్నది ఎస్-బాన్. అటువైపే ఉన్నది యెనోవిట్జ్ వంతెన, దాని తరవాత అలెగ్జాండర్ ప్లాట్జ్, తరవాత మార్క్స్-ఎంగెల్స్ ప్లాట్జూ, తరవాత ఫ్రీడ్‌రిఖ్‌స్ట్రాసూనూ. ఒక్కోసారి గాలి అనుకూలంగా వీచేటప్పుడు, ఇన్‌స్పెక్టరు లౌడ్‌స్పీకరులో, "డిమొక్రాటిక్ సెక్టరులో ఆఖరి స్టేషను," అని కేకపెట్టడం ఆమెకు వినిపిస్తుంది. తరచు ఆ కంఠం ఆమెకు కలలో కూడా వినిపించేది. ఇక ఇవాళ ఆ కంఠాన్ని చాలాకాలానికి మళ్ళీ దగ్గరనుంచి వింటుంది, మరి ఈ జీవితంలో వినదు. ఎన్నటికీ, మరెన్నటికీ వినదు.

ఆ మాట అనుకుని ఒక విధంగా షాక్ కావాలని ఆమె అనుకున్నది, అధమం గగుర్పాటైనా కలుగుతుందనుకున్నది. 'మరెన్నటికీ' అనుకున్నప్పుడు ఆమె నాడి అయినా కాస్త వేగంగా కొట్టుకోలేదు. చిత్రం, నాకీ ప్రాంతం తెలుసు.... అనుకున్నది. నలభై ఏళ్ళుగా అన్నది చేర్చిఉండవలసింది, కాని ఆమెకు తన వయసు గురించి ఆలోచించాలని లేదు. అలా ఆలోచించడం ఆమె చేసుకున్న నిర్ణయానికి అనుకూలించదు, అందుచేత....నా చిన్నతనం నుంచీ, అని వాక్యం పూర్తి చేసుకున్నది.

కాని ఆమె పూర్తిగా విరక్తి చెంది ఉండడంచేతనేమో, పశ్చిమ బెర్లినులో తనకు నూతన జీవితం ఆరంభమవుతుందన్న ఆలోచన ఉత్సాహాన్ని కలిగించ లేదు. అదీగాక ఆమె దాన్నిగురించి ఇప్పటికే తెగ ఆలోచించి ఉండడంచేత గగుర్పాటుకు అవకాశం లేకపోయింది.

తలుపు కిర్రుమన్నది. ఆమె గిరుక్కున తిరిగింది. వాల్టర్ లోపలికి వచ్చాడు. ఆమె అతన్ని గమనించనేలేదు.

"ఈవెనింగ్, ఎల్సే."

హృదయం ఇప్పుడు వేగంగా కొట్టుకోసాగింది. "ఈవెనింగ్, వాల్టర్." అతను మెట్లమీది దీపం వేసినట్టు లేదు. వేసినట్టయితే అతని కళ్ళు చీకటికి

అంత త్వరగా అలవాటుపడడమూ, మంచంమీద ఉన్న చిన్న సూట్‌కేసు అతని కళ్ళపడడమూ జరిగేది కాదు.

"వెళ్ళిపోతున్నావా ?" అమె సరసనే అతను కిటికీలోనుంచి బయటికి వంగాడు. అతనినుంచి మళ్ళీ అమెకు ప్రింటింగ్ ఇంక్ వాసన వచ్చింది; అమె కా వాసన ఇంకా ఇష్టమే.

"నువు వచ్చినదాకా ఆగి వెళదామనుకున్నాను."

అతనేమీ అనలేదు, ముడుచుకున్న తన చేతులమీదికో, లేక వాటిమీదుగా నిశ్చలంగా ఉన్న నీటికేసో చూశాడు. అది చేపలుపట్టే చూపు—అతనిలో అదొక్కటే అమెకు అసహ్యం.

"కానీ, ఏదోఒకటి అను."

అతను క్షణంపాటు ఊపిరితీయటం మానాడు, అమె అది గమనించింది. కాని అతనేమీ అనలేదు, రెండుగుటకలు వేశాడు, అంతే.

"నా బుద్ధి మారుతుందనుకున్నాను, కాని అంతకంతకు మరింత అన్యాయమవుతున్నది. హోంనుంచి సరిగా ఇల్లు చేరుతా ననుకోనుకూడా లేదు—అలాటి స్థితికి వచ్చాను. అంత....అంత నిర్జీవంగా, బిక్కుబిక్కుమంటున్నది ఇక్కడ. అంత శూన్యంగా, అంత మూగబోయి ఉన్నది !'' ఇప్పుడు గగుర్పాటు కలుగుతున్నది. అమె జలదరించింది. "ఏ చంద్రుడిమీదో ఉన్నట్టున్నది. ప్రాపగాండా తోరణాలు మించి ఏమీ లేవిక్కడ.''

వాళ్ళకు దిగువగా ఒక మోటారుబోటు చప్పుడు చేసుకుంటూ పోయింది, చుక్కాని పట్టేవాడి పైపు విడిచి విడిచి వెలుగుతున్నది.

అతను నింపాదిగా, "నువు పొరబడుతున్నా వనుకుంటాను, ఎల్సే. ఇది ఎలాటి చోటన్నదే ఆలోచిస్తున్నావు. మనుషులను మరిచావుకావా ?'' అన్నాడు. అతను తల కొంచెంగా పైకెత్తాడు, కాని అమెకేసి చూడలేదు.

"మనుషులు....'' అన్నదామె, అమె మూతికొసలు జారాయి. "ఎటువంటి మనుషులు ? నేను చూస్తూనే ఉన్నానుగా. హోంలో రోజూ వాళ్ళకు సర్వుచేస్తూనే ఉన్నా. తిండి దిగమింగుతారు. ష్నాప్సో, బీరో దిగతాగుతారు, గొంతులు తగ్గించి మాట్లాడుకుంటారు, కొత్తవాళ్ళెవరన్నా వచ్చి బల్లదగ్గర కూర్చుంటే విషయం మార్చేస్తారు, ఎన్నడూ గట్టిగా నవ్వరు, మందహాసమైనా చెయ్యరు, దిక్కుమాలిన

మార్కు నోట్లు చుట్టబెట్టుకుంటారు, చిల్లర పైసలతో సహా లెక్కపెట్టుకుంటారు, చచ్చి సున్నమైనవాళ్ళలాగా లేచి, ఎలా బరువుగావచ్చారో అలాగే వెళ్ళిపోతారు.''

''సరే, వాళ్ళుండేదే అలా. తెల్లవారుజామున నేను ఎస్ – బాన్‌లో చూసే టప్పుడు వాళ్ళు ఇంతకన్నకూడా అన్యాయంగా ఉంటారు. నేనైనా, ఆ ఊగిస లాడుతూ నడిచే బండి నడవలో నిలబడి, రెండుపక్కలా ఎదురుమదురు సోల్పు లలో మౌనంగా కూర్చుని, జన్మలో ఎన్నడూ ఒకరి నొకరు పలకరించుకోని మనుషులను చూసి, ఏమైనా వాళ్ళంతా ఒకటేగదా అనుకున్నప్పుడు ఆందోళన పడతాను,'' అన్నాడతను.

దూరాన ఒక టగ్ పడవ కూతవేసింది. ఆమె పరధ్యానంగా ఆలకించింది. అవును, ఆమె అర్థంచేసుకో గలిగింది.

“నీకేం ? నీకు వాళ్ళింకా బెర్లినుమనుషులే. కాని మనం ఎంతోకాలంగా, రాత్రివేళ ఇక్కడి వీధుల్లాగా నిర్జీవంగానూ, శూన్యంగానూ లేమా ? నాలో నా కలాగే కనిపిస్తున్నది. లేకపోతే, నియాన్‌సైన్‌ల కోసమూ, కాంతివంతమైన దుకాణాల గవాక్షాల కోసమూ, మంచి దుస్తులు వేసుకున్న మనుషుల కోసమూ, నవ్వుకోసమూ, కాస్తంత సుఖంకోసమూ ఇంతగా ముఖంవాచిపోతానా ? ఇక్కడ ఉంటే ఎక్కడో ఎడారిలో ఉన్నట్టున్నది. ఎందుకంటే మనం పూడిపోతున్నాం, కృశించి, వొరుగైపోతున్నాం.'' ఆమె తనగొంతు వొణకడం గమనించి మాట్లాడడం మానేసింది.

అతను దీర్ఘంగా శ్వాసతీసి, “అందరూ ఇలాగే చేశారనుకో. తూర్పుబెర్లిను ఎవరో ఒకరు నడపాలిగద ? బొల్లికబుర్లు చెప్పే పార్టీ మనుషులు కాదుగద ? మనమే. బెర్లిను మనుషులం మనమూ—వాళ్ళుకారు,” అన్నాడు.

''మన చేతిలో అధికారం ఉన్నట్టు మాట్లాడుతున్నావు.''

“గట్టిగా నిలబడడం ఎన్నడైనా దౌర్బల్యం అవుతుందా ఏం ?''

ఆమె నీరసంగా, ''నాలో నిలబడేశక్తి లేదు. నా పని అయిపోయింది. ఒక్క అడుగుకూడా ముందుకు పోలేను. నే నిక్కడే పుట్టాను, ఏమైనా ఇక్కడి నుంచి కదలను అనుకున్నాను. అందుకు మనిద్దరమూ అవసరమని నాకు తెలుసు. కాని నా ఆట కట్టింది. 1945 నుంచీ నాకున్న శక్తియావత్తూ ధారపోశాను. దాన్ని తిరిగి తెచ్చుకుంటా ననుకున్నాను, కాని అది తిరిగి రాదు,'' అన్నది.

"అది తిరిగి వచ్చేదీ లేనిదీ నీలోనే ఉన్నది," అన్నాడతను తన తలను ఎడమప్రక్కకు కుర్ఫుర్స్టెన్ వంతెనకేసి తిప్పి. "ఆ ఆకాశం వెలుతురు చూడు. ఈ స్త్రీని చూడు. నీకు బలం ఎక్కడబడితే అక్కడే దొరుకుతుంది, ఎక్కడ కావాలంటే అక్కడ దొరుకుతుంది."

ఆమె కోపంగా, "నీకు దొరుకుతుంది. నాకు కాదు. నాకు ఓదార్పు జాస్తిగా కావాలి. నాకు ఊపిరాడడం లేదు," అన్నది.

అతనేమీ అనకుండా, ముడుచుకున్న తన చేతులమీదుగా నీటికేసి చూశాడు—అదే చేపలుపట్టే చూపు. అతన్ని చూస్తే తనకు ఈర్ష్య ఆరంభమవుతున్నట్టు ఆమె తెలుసుకున్నది. ఇక వెళ్లాలి.

"సరే, నేను పోతున్నాను," అన్నదామె కదలకుండానే.

అతను ఊపిరి పీల్చడం మళ్ళీ మానేశాడని ఆమె గ్రహించింది. గుటకలు వేస్తున్నాడేమో కూడాను. కాని అతను నిటారుగా నిలబడ లేదు. అతని చేతులు బరువెక్కినట్టున్నాయి.

ఆమె నింపాదిగా మంచం వద్దకు వెళ్ళి, సూట్‌కేస్ తీసుకున్నది. ఇప్పుడు మళ్లీ ఆమెకు తన లోపల డొల్లగా ఉన్నట్టనిపించింది—ఏ ఉద్రేకమూ లేదు, విచారం కూడా లేదు.

"పోతున్నాను, వాల్టర్."

తలుపు మూసుకున్నది. మెట్లమీది దీపం వెలిగింది. వెళ్ళిపోయింది.

ఆవరణలో ఆర్పిన బొగ్గుల వాసనా, చీకిపోతున్న కర్రవాసనా కొట్టింది. తాను ఎత్తులేని మడమల పాదరక్షలు వేసుకోడం మంచిదయింది; పరుపుడు రాళ్ళమధ్య పగుళ్ళను గురించి మథనపడ నవసరం లేదు. బ్రైట్‌స్ట్రాస్ వీధి వెంబడి రాదగా వీచే గాలిలో ముకుగువాసన వచ్చింది—స్ప్రీ నది వాసన. అతని స్ప్రీ. ఎల్బే ఇళ్లకు సమీపంగా నడిచింది. ఎన్నో ఇళ్లకు కప్పులు పోవడం చేత, ఎగువనున్న ఆకాశం ఆక్టోపస్ (అష్టపాది) లాగానూ, నిడుపైన కంతలు దాని అంగాలలోని సక్కర్‌లలాగానూ, దాని పాదాలు తనను ఎగలాగుతున్నట్టూ అనిపించింది.

అయితే అంతలోనే ఇళ్ళు ముగిసి, విశాలమైన మార్క్స్ – ఎంగెల్స్ ప్లాట్జ్ గచ్చుచేసిన బీడులాగా ఆమె ఎదట ప్రత్యక్షమయింది. కనుచూపు మేరలో ఒక్క పురుగుకూడా లేదు; ఆమె వెనకపార్శ్వంలో కుడిపక్కగా దెబ్బతిన్న కెథీడ్రల్

రాతిగుమ్మటమూ, దాని అంచులమీద నిశ్శబ్దంగా బాకాలూదే దేవదూతలూ మాత్రమే ఉన్నారు. కాంక్రీటువంతెన అవతలిపక్క ఒక పోస్టరు కొన ఊడి వచ్చి, ఎగుడు దిగుడు అక్షరాలకేసి కొట్టుకుంటున్నది. ఒకప్పుడు ఇక్కడ రాజభవనం ఉండేదనీ, తొమ్మిది మాసాలక్రితం క్రిస్మస్ మార్కెటు అక్కడ ఉండేదనీ, దాని దుకాణాలకూ ఎర్ట్‌గెబిర్గె నుంచి వచ్చిన అట్టతోచేసిన మరుగుజ్జులకూ మధ్య ఉండే వీధిలో అల్ట్రావయొలెట్‌తో ఉష్ణం ఏర్పాటయి ఉండేదనీ, ఆ మరుగుజ్జు అట్ట బొమ్మలు రాక్షసి ప్రమాణంలో ఉండి, భయంకరంగా రెడ్ ఆర్మీ సైనికులను జ్ఞాపకం చేసేవనీ ఇప్పుడనుకుని ఆపే ప్రయోజనం లేదు; కళ్ళు ప్రక్కకు తిప్పుకునీ ప్రయోజనం లేదు, ఎటు చూచినా శూన్యం కనబడుతూనే ఉన్నది. తన చిన్న సూట్‌కేస్‌ను చంకలో గట్టిగా పట్టుకుని ఎల్సే కుప్‌ఫెర్‌గ్రాబెన్ వంతెనకేసి వెళ్ళింది.

ఊంటర్ డెన్ లిండెను కుండా ఒక బస్సు ఆమెకేసి వచ్చింది. అది తన పక్కగా గతుకుతూ పోయేటప్పుడు దాని గవాక్షాల వెనక ఉన్న కళాహీనమైన ముఖాలకేసి చూసి తృప్తిగా ఒక నిట్టూర్పు విడిచిందామె.

జూగ్‌హౌస్ దాటాక కాస్త నయమనిపించింది. వీధిదీపాలు ప్రకాశిస్తున్నాయి, లిండెన్ చెట్లు గలగలలాడుతున్నాయి, అక్కడక్కడా కాస్త నర సంచారం కూడా ఉన్నది. మరమ్మతు చేసిన యుద్ధ స్మారకచిహ్నం యొక్క అలవ ముందు, ఎఫ్. డి. జె. యూనిఫాములు ధరించి, చేతులు కలుపుకుని మునివేళ్ళమీద నిలబడిన జంట, వెనకఉన్న శూన్యగహ్వరం కేసి ఆశాభంగంతో చూస్తున్నది.

త్వరలోనే అక్కడ మళ్ళీ జ్యోతిని ఏర్పాటు చేస్తారు, అనుకున్నది ఎల్సే. ఆమె నడిచివెళుతూ, తాను బడికివెళ్ళే పిల్లయినట్టూ, తనతో బాటు ఇంకా అనేకమంది విద్యార్థిను లున్నట్టూ, తామంతా జూగ్‌హౌస్ గవాక్షాలనుంచి గార్డుల మార్పు చూడడంకోసం ఆత్రంగా వేచి ఉన్నట్టూ ఊహించుకున్నది. ఆమెకు కనిపించినది ఉక్కు శిరస్త్రాణాలు ధరించిన యంత్రాలలాటివాళ్ళు, శలవురోజున తిరిగేటప్పుడు వాళ్ల ఎదురైతే వాల్టర్ పళ్లు బిగబట్టి వాళ్ళకు సలాం కొట్టాలి.

పెచ్చులూడిన బ్రాండెన్‌బర్గు గేటు స్తంభాలమీద ఫ్లడ్ లైటున్నది. దూరం నుంచే వాటిమీది వెలుగు ఆమెకు ఆకుల సందులనుంచి కనిపించింది. ఆమె 'కొత్త

జీవితం'గా పరిగణిస్తూ వస్తున్నది వాటికి అవతల ఉన్నది. నిజంగా అక్కడ ఏదో ఆరంభ మవుతున్నదని కాదు. అక్కడా ఇదే నగరం. ఇక్కడ మొలిచే పిచ్చిమొక్కలే అక్కడా మొలుస్తున్నాయి. ఒక ఆదివారం ఉదయం ఆమె తెలుసుకున్నది— తన వంటయింటి కిటికీలోనుంచి చూస్తే షింకెల్‌ప్లాట్జ్ తాలూకు ప్లేన్ చెట్లమీది కాకులు అరిచినట్టే టీర్‌గార్డెన్‌లోని కాకులూ అరుస్తాయి.

అయినాకూడా అక్కడ కొత్తప్రపంచం ఆరంభం కానే అయింది. గాలిలోనే మార్పున్నది—అది ఇంకా స్వేచ్ఛావాయు వనడానికి లేదేమోగాని, ఆశాపూరిత మైన వాయువు మాత్రం అవును.

ఇక్కడ ఏదో ఒకటి దొరికితీరుతుంది. కసువు ఊడ్చే పనే కానీగాక, అనుకున్న దామె.

ఆమె ఫ్రీడ్‌రిఖ్‌స్ట్రాస్‌లోకి తిరగగానే తన గుండె తపతపా కొట్టుకుంటూ ఉండడం గమనించింది. ఇక్కడా జీవితం ఉన్నది ; వదులుగా ఉండి, టపటపా కొట్టుకునే షరాయిలూ, దీర్ఘకేశాలూ, వెడల్పయిన టైలు అతి జాగ్రత్తగా వేసుకున్న యువకులు డాన్సుహాలుల ఎదట నిలబడి, తమలోతాము పాడుకుంటూ, లయప్రకారం శరీరాలు ఆడిస్తున్నారు.

ఎల్సే ముందుకు సాగుతూ, రైలువంతెన మీద ఉన్న అమిత పెద్ద బల్బుల పలకమీద అతి నింపాదిగా పాకుతున్న నియోన్ సైన్ ఏమిటో తెలుసు కుందామని ప్రయత్నించింది. ఏదో డెలిగేషనుకు ఎక్కడో గంభీరమైన సత్కారం జరిగిందట. వాళ్ళు ఎంతకైనా తగుదురు !

ఆమె కొద్ది మెట్లెక్కి, ఖాళీగా ఉన్న టిక్కెట్ల హాలుగుండా టిక్కెట్లిచ్చే చోటికి వెళ్ళి, "ఒకటీ ఇరవై ఇవ్వండి," అని అడిగింది.

ఆమెకు తానేదో గొట్టంగుండా మాట్లాడినట్టనిపించి, అద్దాల కిటికీ వెనక ఉన్న స్త్రీ మరుక్షణమే టిక్కెట్టు ఇచ్చేసరికి ఆశ్చర్యం కలిగింది. తాను అవతలి వేపు కెళ్ళిపోతున్నదని — దాన్ని రిపబ్లికు నుంచి పరారీ కావడమంటారు— ఆ మనిషి గమనించలేదా ?

వాళ్ళెందుకు గమనించకుండా ఉంటారు ? ఎగువన, ప్లాట్‌ఫాం మీద, ఉన్న రవాణాపోలీసువా డొకడు ఆమెను చూసి, బొటనవేళ్లు తన బెల్టు బకిల్ వెనక ఉంచుకుని, బరువుగా నడుచుకుంటూ ఆమెకేసి వచ్చాడు.

దిక్కుమాలిన సూట్‌కేసు : అందులో ఉన్నవల్లా ఓ జత దుస్తులూ, కొన్ని లోదుస్తులూ, స్నానపరికరాలూ, జ్ఞాపకార్థం ఉంచుకున్న ఒక చెయ్యిలేని బొమ్మా మాత్రమే :

ఆ మనిషి మరొకందుకు మందహాసం చేశాడు, అదైనా ఆటేసేపు కాదు; ఆ క్షణంలోనే ఆమె ముఖంపైన వెలుగు పడివుండాలి, ఆ పోలీసు మందహాసం మానేసి, చప్పుడు లేకుండా ఈలవేసుకుంటూ ఆమె పక్కగా వెళ్ళిపోయాడు.

ఫిల్మ్‌పోస్టర్లంటించే బల్లకేసి ఆనుకుని నిలబడి, ఎల్సే ఒక్క క్షణంపాటు కళ్లు మూసుకుంది.

తరవాత రైలు వచ్చింది, ఆ గొంతు వినిపించింది—తనకు కలల్లోకూడా వచ్చే లౌడ్‌స్పీకరు గొంతు : "డెమొక్రాటిక్ సెక్టరులో ఆఖరు స్టేషను.''

తథాస్తు, అనుకున్నది ఎల్సే.

వేళ్ళకణుపులు పాలిపోయేటంత గట్టిగా రెండుచేతులా తన చేతిపెట్టె హేండిల్ పట్టుకుని, కిటికీ ప్రక్కన తన స్థానంలో ఆమె బిగుసుకు కూర్చున్నది. ఏమీ ఆలోచించరాదు. ఏమీ పట్టనట్టు కనబడాలి. వాళ్ళిప్పుడైనా తనను దింపెయ్యగలరు.

లేదు, ఆ అవకాశం మరి లేదు, తలుపు మూసుకున్నది. రైలు కదిలింది; పెట్టెలో ఎవరూ ఆమెకేసి చూడడం లేదు.

తాను చేస్తున్న పని ఏమిటో ఇప్పుడైనా స్పష్టంగా తెలుసుకుందామని ఆమె యత్నించింది, కాని తాను ఎస్-బాన్‌లో ఉన్న సంగతి తప్ప అంతకుమించి మరేమీ స్ఫురించలేదు.

అంతలో ఆకస్మికంగా, కిటికీలోని తన అస్పష్ట ప్రతిబింబంకుండా బెర్లిన్ నగరం పోతూ ఉండడం కనబడింది: రైష్టాగ్ శిథిలం; దాని మీది రెండు ఇనప గుర్రాల చట్రాలు, వాటిమీది రౌతుల బొమ్మలు ఏనాడో పోయాయి, వాటి ఆధారాలు మాత్రం పగటివేళ కనిపిస్తాయి; స్ప్రీ తీరం వెంబడి చెత్తగుట్టలూ, రాతిసి బొగ్గు గుట్టలూనూ; హంబోల్డ్‌రేవూ, దాని వెనక ఇటుకల ఇళ్ళూనూ; లెహార్టర్ రైలుస్టేషను; మోబిటర్ గుడ్స్ షెడ్‌లు; చాలా దూరంగా, చీకటిగా ఉన్న టీర్ గార్టెన్ అవతలిపక్క చెదిరిన నక్షత్రకాంతిలాగా ప్రకాశిస్తూ మరొక బెర్లిన్, కాంతివంతమైనది, కలవరించినది, సుఖమయమైనది. ఎల్సే తన నుదుటిని కిటికీకేసి నొక్కి, దానికేసి చూసింది.

అవును, అదే. ఇప్పుడది తనచుట్టూ ఉన్నది. ఆ కనిపించే చుక్కల్లాటి దీపాలలో ఏదైనా, తాను ఊడవబోయే గదిలోది కావచ్చు.

ఏదైనా ఆఫీసుగది అవుతుందేమో ననుకున్నదామె. తనచుట్టూ కొంత కాలంపాటు జనం మూగకుండా ఉంటే బాగుండును. కాని, బెల్‌వ్యూలోనే వాళ్ళు ఎక్కారు—ఆకర్షవంతమైన దుస్తులు ధరించి, నవ్వుతున్న జంటలు: ఆడపిల్లలు మహాచక్కగా ముస్తాబయారు, వాళ్ళ డ్రెస్సులు ఊగిసలాడుతున్నాయి; యువకులు నిండైన ముఖాలతో, జుట్టు గొరిగించుకుని, కాలిజోళ్ళు పాలిష్ చేసుకుని, కళ్ళు జిగేలుమనేటంత తెల్లనిషర్టులు వేసుకుని ఉన్నారు. వాళ్లు స్వర్గలోకవాసులు!

కాని చిత్రమేమంటే, ఎల్సే వాళ్ళకోసం అంతగా కలవరించినా, వారిని చూసి ఆనందం పొందలేకపోయింది. తనను తాను ఎంతగా హెచ్చరించుకునీ లాభంలేకపోయింది; ఆమె కేదో అడ్డొస్తున్నది—ఒక మనిషి, ప్రింటింగ్ ఇంకు వాసన కొట్టుతూ, ముందుకు వంగి, ముడుచుకున్న చేతులమీదుగా మౌనంగా నిలుచున్న ఒక చిన్న మనిషి.

ఇప్పు డామెకు తనలో ఒక బస్సు నడుస్తున్నట్టనిపించింది. ఆమెకు తిరిగి కిటికీల వెనక తీవ్రమైన కాంతిలో అలసి, నిర్జీవంగా ఉండే ముఖాలూ, చప్పిదవడలూ, గుంటకళ్ళూ కనిపించాయి; అంతలోనే బయట హాంజా డిస్ట్రిక్టు పక్కగా పోతూ కనబడింది; అక్కడ అపరిమితంగా ఎత్తుగా ఉండే రాక్షసి భవనాలు, అంతస్తుమీద అంతస్తు పేర్చి, తేనెపట్టుల్లాగా ఆకాశమంటేట్టు కట్టారు. ఇవి విడికుటుంబాలు అద్దెకుండడానికి కట్టిన బ్లాక్‌లు. ఈ బ్లాకులలో ఉండే దీపాల కాంతిలో మార్దవం లేదు. కిటికీ అద్దంలో ఎల్సే ముఖంయొక్క ప్రతిబింబంకుండా ఈ భవనాలు నిమిషాలతరబడి కనబడినప్పుడు, ఆమె ముఖంలోనే వాకిళ్లూ, కిటికీలూ, కర్టెన్లూ, ఇళ్ల నంబర్లూ, మెట్ల చిడీలూ, బాల్కనీలూ ఉన్నట్టనిపించింది. ఆ ప్రతిబింబం, ఇక్కడ నీకేంపని, ఎల్సే? అని అడుగుతున్నట్టుగా ఆమెకేసి చూసింది.

ఆమె కళ్ళుమూసుకుని హోటల్ పాకశాలను స్మరణకు తెచ్చుకో యత్నించింది: ఆ ఆవిరీ, వాంతి తెప్పించే వాసనలూ, ఆమె తన ఆప్రన్ తగిలించే అలమారులో తుప్పూ, వాడిపోయి నిగనిగలాడే ఇతర స్త్రీల ముఖాలూ—ఎవరైనా తినటానికి వచ్చి ఏదైనా అడిగినప్పుడు తాను యాంత్రికంగా అతని ఐడెంటిటీ కార్డు లడగడం కూడా ఆమెకు వినిపించింది. తినడానికి వచ్చేవాళ్ళుకూడా ఆమెకు కనిపించారు,

వారంతా కళాహీనంగా, అందరూ ఒకేలాగా ఉన్నట్టు ఊహించడాని కామె ప్రయత్నించింది. సాధ్యం కాలేదు. ఆమె వాళ్ళను స్పష్టంగానే ఊహించగలిగింది; కళ్ళ ఎదట ఉన్నట్టుగానే చూడగలిగింది. కాని ఆకస్మికంగా, ఆమెకుండిన విసుగూ, వికారమూ, నిస్సత్తువా—ఆమెకుండిన సమస్త అభ్యంతరాలూ—మాయమయాయి.

అక్కడ కూర్చుని ఉన్నది మనుషులు, తనలాటి మనుషులే—ఒకవేళ వాళ్ళ నడుములు వంగిపోయాయేమో, వాళ్ళు అలసిఉన్నారేమో. కాని వాళ్లు బెర్లిను వాసులు. ఇక్కడే అంటిపెట్టుకుని ఉన్న బెర్లినర్లు, ఇక్కడే పుట్టారు, ఇక్కడినుంచి వెళ్ళిపోలేదు, తమ అలెగ్జాండర్ ప్లాట్స్‌కు అంటిపెట్టుకున్నారు; ఈ ఖాళీగాఉన్న, కళాహీనమైన, గుంటలుపడిన వీధులనూ, తమ పాతనివాసాలనూ, యుద్ధంలో దెబ్బతిన్న భవనాలనూ, ధ్వంసమైన దొడ్లనూ నమ్ముకుని, వెళ్ళి పోకుండా ఉన్నారు. వాళ్ళలో పెత్తందార్లు కూడా ఉన్నమాట నిజమే—పార్టీ పెద్దలూ, ఆశ్రితులూ. కాని మిగిలినవాళ్ళ మధ్య వాళ్లేం లెక్కలోకి వస్తారు? ఏమీరారు.

బెర్లినర్లము మనమూ, వాళ్ళు కారు, అన్నది ఆమె అంతర్వాణి.

ఆ పలికినది వాల్టర్ కంఠం అని తెలిసి ఆమె గుండె వేగంగా కొట్టుకో సాగగానే, బయటి అంధకారం కొంచెంగా తేలికయినట్టయింది. ఆకుపచ్చ, ఎరుపు, పసుపు రంగులలో ఎడ్వర్టయిజ్మెంట్లు కొట్టవచ్చినట్టు కనబడ్డాయి. పత్రిక లమ్మే బంకులలోని దీపాలు కాంతివంతంగా ప్రకాశించాయి. చాలా ఎత్తుగా ఉన్న భవనం ఒకటి పక్కవాటంలో కనబడింది, దాని నిలువునా దీపాలు వెలుగుతున్నాయి, అది నల్లని ఆకాశంలోకి లేచిన జ్వాల లాగా ఉన్నది. రైలు ఆగగానే అందులోకి జనం—ఆహ్లాదకరంగా, ఆనందంగా, ముచ్చటగా, ముస్తాబుగా ఉన్న వాళ్ళు—పెట్టెలోకి తోసుకొచ్చారు. ఎల్సే చివాలున లేచి, తన చేతిపెట్టె గట్టిగా అదిమి పట్టుకుని, జనాన్ని నెట్టుకుంటూ బయటికి వచ్చింది.

జూ స్టేషను. ఆమె పగటి కలలలో ఆమె నూతన జీవితం ఇక్కడే ఆరంభమవుతూండేది. మరి ఇప్పుడు? పొరపాటు చేశాను, ఇది కల కాకపోతే, నే నిక్కడ పరాయిదాన్ని, దారి తప్పాను, ఆ కాంక్రీటు పెట్టెలేమిటి? చంద్ర మండలం మీద లాగ, అనుకున్న దామె.

ఆమె అలిసిపోయి ఒక బెంచీమీద చతికిలబడి, అశ్రువులతో చిమచిమలాడే కళ్ళతో, మిలమిలా మెరిసే హార్డెన్‌బెర్గ్‌స్ట్రాస్‌నూ, రోడ్డు అవతలిపక్క స్పాట్

లైట్‌లు వేసిఉన్న మిమోరియల్ చర్చినీ చూసింది, పెనసలులాగా నిలబడి ఉన్న స్కై‌స్క్రేపరు భవనాన్ని మరొకసారి చూసింది. ఆమె చూపులు విశ్రాంతి తీసుకునే చోటు కనబడ లేదు.

మనుషులు—ఎప్పుడూ నేను చేసే తప్పే—ప్రదేశమే చూస్తాను; అయితే ఇక్కడమటుకు మనుషులు లేరా ? అనుకున్నదామె.

అవును, మనుషులున్నారు. వందలకొద్దీ ఉన్నారు. వాళ్ళు వీధి వెంబడి వెళుతున్నారు, ప్లాట్‌ఫాం మీద వేచి ఉన్నారు, బార్‌ల ముందు నిలిచి ఉన్నారు, అటూ ఇటూ తిరుగుతున్నారు, పొగతాగుతూ, చదువుతూ, మౌనంగా, మాట్లాడుతూ తన పక్కన ఉన్నారు. కాని వాళ్ళు అపరిచితులు. తాను రోజూ సర్వ్ చేసే వాళ్ళకీ, వీళ్ళకీ ఏమీ సంబంధం లేదు. హోకు వచ్చే మూకమధ్య నిలబడితే వీళ్ళలో ఏ ఒకడైనా సరే రంగుల బొమ్మలాగుంటాడు.

ఏమిటి నీ యెత్తు ? నీకు కావలసిన నవ్వులూ, దీపాలూ, మంచి మంచి దుస్తులూ ఎదట ఉన్నాయి గద, ఇంక ఆనందించు, అనుకొన్నదామె.

ఆనందింతామని గట్టి ప్రయత్నమే చేసింది; కాని దేనికని ఆనందించాలో ఆమెకు తెలియలేదు. తా నిప్పటికి నాలుగు స్టేషనులే వచ్చినట్టు ఆమెకు చప్పున తట్టింది, నాలుగు స్టేషనులు వచ్చేసరికి మరొక దేశం ! ఆ వెంటనే ఆమెకు మరొకటి కూడా తట్టింది: ఆమె నాలుగు స్టేషనులు వెనక్కుపోతే చాలు, "ఫ్రీడ్ రిఖ్‌స్ట్రాస్ !" అనే గొంతు వినబడుతుంది, లౌడ్‌స్పీకరులో నుంచి.

ఆమె తిరుగుబండిలో ఎక్కి కూర్చున్నప్పుడు చాలా సౌమ్యంగా ఉన్నది. ఆమె తన సూట్‌కేసును లగేజీ అరలోకి అలక్ష్యంగా విసిరివేసి, వాకిలి దగ్గరే నిలబడింది. రైలు కదిలి, జూ డిస్ట్రిక్టులోని దీపాలు కనిపించినప్పు డామెకు కుప్‌ఫెర్‌గ్రాబెన్ స్మరణకు వచ్చింది.

అక్కడ ఇన్సెల్ వంతెన వద్ద ప్రింటింగ్ ఇంక్ వాసనకొట్టే ఒక చిన్న మనిషి, ముడుచుకున్న చేతుల మీదికి వంగి, తన చేపలుపట్టే దండం కేసి చూస్తూ ఉంటాడు. తాను చప్పుడు చెయ్యకుండా అతని వెనకగా వెళ్ళి నిలబడాలని ఆమె నిశ్చయించింది. అతని సంగతి తెలుసు గనక, అంతా మరిచిపోవడానికి అదే మంచి మార్గ మనుకున్నది.

జూను 1936.

అతను కాలువ వద్ద నిలబడి నీటికేసి చూస్తున్నాడు. అది కావడానికి కుప్‌ఫెర్‌గ్రాబెన్ అయినా, గాలంకర్ర పట్టుకున్న అతని చేతికి, స్ప్రీ ప్రవాహం తన ఎరను పాచిపట్టిన రాళ్ళ మీదుగా కాలువముఖంకేసి లాగడం తెలుస్తున్నది.

రాత్రివేళ. అవతలిపక్కనున్న మార్క్‌షెన్ ఊఫెర్ కిటికీలలోని కొద్ది దీపాలూ ఆరిపోయి చాలాసేపయింది. ఎడమ పక్కన, ఇన్సెల్ వంతెనకు అటూ ఇటూ ఉన్న రెండు గాసుదీపాలూ ఇంకా పొగలు కక్కుతూ వెలుగుతున్నాయి. వంతెన ఆర్చీల కింద, కారునలుపు నీటిపైన ఉన్నట్టుండి కాంతి మెరుస్తున్నది—స్ప్రీ రేవు వెలపల బారుగా ఉన్న టగ్ పడవలు నదిమీదికి వేసే దీపాల ప్రతిఫలనం.

పెద్ద పొరపాటయిపోయింది. నైట్‌షిఫ్ట్ వాళ్లందరితోనూ దీర్ఘమైన సంభాషణలు పెట్టుకోకుండా అతను మామూలు ప్రకారం వచ్చేసి ఉండవలిసింది; చూసి చూసి వాళ్ళు చిరాకుపడ్డారు, ఎందుకంటే యంత్రాలు నడుస్తున్నాయి, గొంతు చించుకుని అరిస్తేగాని ఒకరిమాట ఒకరికి వినబడదు.

కాని అతను ఏం చేసేటట్టు? ఒకేచోట పదిహేనేళ్ళు రోటరీ ఆపరేటరుగా చేసిన పనిని దులిపేసుకుపోవడం సాధ్యమా? రోల్స్ నుంచి సిలిండర్ల మీదుగా అనంతంగా నడిచే కాగితాన్ని మరొక అరగంటసేపు చూడాలి. వేడితైలంనుంచీ, ప్రింటింగ్ ఇంక్‌నుంచీ వచ్చే దివ్యమైన వాసన—మేన్‌హాల్‌లో అది మరీ దట్టంగా ఉంటుంది—ఆఘ్రాణించాలి.

ఇక అతనితో కలిసి పనిచేసేవాళ్ళ మాటకొస్తే — వారిలో తనలాగే షెర్ల్ వద్ద టైప్‌సెటింగ్ పని నేర్చుకున్నవా ళ్ళిద్దరున్నారు— షూట్జెన్‌స్ట్రాస్ మొగదల, సరిగా ఇప్పుడు గోడ ఉన్నచోటే, ఉండే యెన్సాల్‌మెర్ షెర్ల్. తామంతా ఏదోఒక ఎసెన్షన్ రోజున ముఖాలకు పెట్టుడుముక్కులు తగిలించుకుని, మోకాళ్ళ మీద హార్మోనికా లుంచుకుని, కోచిలో ఊంటర్ డెన్ లిండెన్ వెంబడి, బ్రాండెన్‌బర్గ్ గేటుకుండా ప్రయాణం చేసినప్పుడు వారిద్దరిలో ఒకడు వెంట వచ్చాడు. ఇలాటి సమయంలో అలాటి విషయాలు జ్ఞాపకం రాకుండా ఎలా ఉంటాయి? కాని ఈ ఒకరోజునే తాను తన ఆలోచనలను తనలోనే దాచుకో

వలసింది కాదా అన్నది ప్రశ్న. ఎందుకంటే, నువు మామూలుగా మితభాషివయి నప్పుడు అతివాగుడు అనుమానాన్ని రేకెత్తిస్తుంది. అతని కది వాళ్ళ ముఖాలలో కనిపించింది.

అతని వెనకగా కొయెల్నిషెర్ ఫిష్‌మార్కెట్ దిక్కునుంచి ఖణేల్‌మన్న చప్పుడు వినిపించింది; మూహల్‌డామ్ వంతెనమీదినుంచి స్లోపువెంబడి బ్రేకు వేస్తూ ట్రాము దిగుతున్న చప్పుడు. దాని అవతల స్పిట్‌ల్‌మార్కెట్, తరవాత డోయెన్‌హోఫ్ ప్లాట్జ్, ఫ్రీడ్‌రిఖ్‌స్ట్రాస్, విల్‌హెల్మ్‌స్ట్రాస్; అటుతరవాత ట్రాము నడిఎడారిలో, శిథిలమైన వెర్‌తైమ్ స్టోర్ ఎత్తులో ఆగిపోతుంది. డ్రైవరూ, కండక్టరూ తిరుగుప్రయాణానికి తొందరపడతారు.

కాని ట్రాము లైనులు మాత్రం ముందుకు సాగిపోతాయి. అదే అసలు సంగతి: ఆ ట్రాములైనులు 'రిపబ్లిక్‌నుంచి పారిపోతున్నాయి.' ప్రభుత్వం రాళ్ళతో వాటిని నిరోధించజూసినా అవి లక్ష్యపెట్టలేదు. అవి మాయచేసి, నేలబారున గోడకిందుగా పాకిపోయాయి: వాటిని ఏ ప్రజాపోలీసులూ ఆపలేకపోయారు; అవి అత్రంగా వెళ్ళి మరొక ట్రాము చక్రాలక్రింద పడ్డాయి.

వాల్టర్ తన గాలం కర్రను కాలువ కంచె చువ్వలకూ, తన సైకిల్ హాండిల్ బార్‌లకూ మధ్య ఇరికించవలసి వచ్చింది. అతని చెయ్యి వణుకుతున్నది; ఇటీవల అతనికా ట్రాములైనులు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా చెయ్యి వణుకుతూనే ఉన్నది.

అయితే ఇవాళ మరొక విశేషంకూడా ఉన్నది. అతనికి అకస్మాత్తుగా చీకటిలో పోట్స్‌డామెర్‌ప్లాట్జ్ కనబడింది; ఎక్కడ చూసినా దిక్కుమాలిన కాంతిలో ఎడారి భూమి, వంకరటింకరగా తవ్విన స్లిట్‌ట్రెంచి, రైలుపట్టాలు అటూయిటూ పెట్టి కొట్టిన బారికేడ్‌లు, యూ-బాన్ మీదుగా కమ్మీలమీద అమర్చిన లోహపు వల, దానికి అవతలిపక్క ఒక టవరూ, పశ్చిమ వార్తలను గబగబా తెలియజేసే బల్బుల స్క్రీనూ. కాని ఎవరికోసం? ఇక్కడ బాధా, చావూ తప్ప జీవిత మేమున్నది? కళ్ళుమూసుకుంటే వాల్టరుకు ఎడారిశూన్యం యొక్క విరుద్ధప్రవాహపు గుంజాడు తెలుస్తుంది. పోట్స్‌డామెర్ ప్లాట్జ్ దాటివెళ్ళిన ట్రాములైనులు కూడా ఈ అసహాయస్థితిని మార్చలేవు. పైగా వాటి కేగమ్యంలేనట్టు కనిపిస్తున్నదిప్పుడు.

ఆగు, దాన్ని గురించి ఆలోచించి కుంగిపోకు, అనుకున్నా డతను. అతను గాలపుతాడు పైకిలాగి ఎరను పరీక్షించాడు. ఎర మెలికలు తిరుగుతూ గాలానికి

చుట్టుకుని ఉన్నది. దాన్ని ఏ చేపా అంటలేదు. వాల్టర్ దానిమీద ఉమ్మివేసి, బరువుతో సహా నీటిలోకి వేసేశాడు.

ఇదే ఆఖరుసారి – ప్రవాహం మందగించగానే, తీసి సర్దేస్తాను.

నడుముపైనుంచి అలవక్రమీదికి వంగి, అద్దంలాగా ఉన్న నీటిలోకి గాలం తాడు ఎక్కడ దిగినదీ చూడడానికి అతను ప్రయత్నించాడు. దాన్నే చూస్తూఉండా లంటే బుద్ధిని ఎంతో కేంద్రీకరించాలి.

అయితే చీకటి మరీ దట్టంగా ఉన్నది. దానికితోడు నీటిపైన పలచ పలచగా ఆవిరి కమ్ముతున్నది. ఇప్పు డతనికి తన దిగువనున్న నీటిలో తన ప్రతిబింబం ఆకారం కూడా కనబడడం లేదు. ఈ క్షణంలో అది కనబడినా కొంత మేలుగా ఉండేది. ఏమంటే, తాను వెళ్ళాక తన ప్రతిబింబం ఇక్కడే కుప్‌ఫెర్‌గ్రాబెన్‌లో దిగబడి ఉంటుందనీ, దాని కిందుగా పర్చ్ చేపలు ఈదుతాయనీ, గండుచేపల తూగిడీ దానినుంచి ఈదుకుంటూ వస్తుందనీ, అలవ మీదిగా మనుషులు మురికి నీరు పారబోసినా, వాన కురిసినా ఆ ప్రతిబింబం చెక్కుచెదరకుండా అలాగే ఉండిపోతుందనీ తనను తాను నమ్మించుకోవాలని అతని ఉబలాటం.

నా కింక ప్రతిబింబమే లేదేమో, క్షవరం చేసుకునేటప్పుడు అద్దంలో కనిపించినది భ్రమేనేమో, ఈ రెండేళ్ళలో అంతకుమించినవే పోగొట్టుకున్నాను, అనుకున్నాడతను.

అతను మళ్ళీ తల ఎత్తాడు. దిగివచ్చే పాదాల చప్పుడు. స్త్రీ పాదధ్వని లాగా స్ఫురించింది. అతను ఊపిరి బిగబట్టాడు .... లేదు, ఆమె ఎవతోగాని, సమీపించడానికి తొందరపడడం లేదు. ఏమైనా, ఆమెకు తెలిసే అవకాశం లేదు. ప్రతి సాయంకాలమూలాగే తాను నేలగదినుంచి చేపల గాలమూ, సైకిలూ తెచ్చాడు గద. వస్తూ వంటింటి డ్రాయరు సొరుగులో కెలికాడు, అంతే.

ఇప్పుడు పాదాలు వంతెనదాకా వచ్చి, అక్కడ కొంచెం సేపు నిలిచి, నింపాదిగా మళ్ళీ కదిలాయి. ఆమే నన్నమాట.

అతను గాలం తాడు కేసి చూశాడు. అది బిగలాగుకుని ఉన్నది.

తాడును పైకి లాగుకుంటూ ఉంటే, ఈల్ చేప దాని చివర మెలికలు తిరుగుతూ, కొట్టుకోవడం తెలియవచ్చింది. అతని చేతికి క్షణంపాటు చిన్న విద్యుద్ఘాతం కూడా అయింది—పెద్ద చేప పడినప్పు డతనికి ప్రతిసారీ అలాటి

షాక్ తగులుతుంది. ఇప్పుడు ఈల్ ఈదుకుంటూ తప్పించుకుపోదామని చూస్తున్నది. వాల్టర్ గజం గజంగా తాడు వదిలాడు. దానితో ఈల్ అయోమయంలో పడింది. అకస్మాత్తుగా పట్టు విడేసరికి, తాను ఎటు పోతున్నదీ తెలియక, అది వెనక్కు తిరిగి ఎదురీదుకుంటూ వచ్చింది. కొంచెం కొంచెంగా తాడును లాగుకున్నాడు వాల్టర్. అది తనకు దిగువగా రాగానే అతను దాన్ని మళ్ళీ పైకి లాగసాగాడు. ఇక ఈల్ ఎంతకొట్టుకునీ లాభం లేదు. గాలం కర్ర దాన్ని పైకి గుంజేసింది. దాని పొట్ట తెల్లగా మెరుస్తున్నది. వాల్టర్ దాన్ని తన వలలోకి తీసుకున్నాడు.

"భలే చేప !" అన్నది ఎల్సే.

ఆమె తన సరసనే వంగి ఉన్న సంగతి అత నిప్పుడే గమనించాడు.

"అవును. రెండుపౌనులకు తగ్గదు," అన్నాడతను బొంగురుగా.

అతను ఆ తన్నుకునే చేపను ఒక గుడ్డపీలికతో గట్టిగా పట్టుకుని, పెంకులాటి దాని అంగుడునుంచి గాలాన్ని ఊడదీశాడు. ఈల్‌కు మరొకసారి కలిగిన జీవితేచ్ఛ ఫలితంగా అతనికి మళ్ళీ చిన్న షాక్ తగిలింది.

తన సైకిలు కారియరు వెనుక కట్టిఉన్న టిన్నులోకి ఈల్‌ను జారవిడిచి, వాల్టర్ మళ్ళీ నీటిలో గాలం వేశాడు. మాట తప్పవలసి వచ్చింది. చేసేదిలేదు.

"చిత్రం, నువ్వీమధ్య నీటిలోకి మామూలుగా చూసినట్టు చూడడం లేదు," అన్నది ఎల్సే.

"అలాగా ?" అతను ఆమెకేసి చూడలేదు.

"దేనికోసమో చూస్తున్నావు. అది పూర్వం ఉండేది, కాని ఇప్పుడు లేదు," అన్నదామె.

అతను సమాధానం చెప్పక, చాలా జాగ్రత్తగా తన చేతులను కర్రమీద ఉంచాడు. చేతులు వణకకుండా ఉంటే బాగుండును.

ఆమె తడితడిగా ఉన్న పొగమంచును పీల్చుతూ, "ఏమిటది, వాల్టర్?" అని అడిగింది.

"ఏమీ లేదు," అన్నాడతను.

"లేకేం ? నీ కేదో విచారం పట్టుకున్నది. చాలాకాలంగా చూస్తున్నాను."

ఆమె ఇంకా పనిదుస్తులే ధరించిఉన్నది. వాటినుంచి పాచిఆహారం వాసన రావడం అతను గమనించాడు. పనినుంచి ఆలస్యంగా తిరిగి వస్తూనే పైన ఒక కోటు కప్పుకుని వచ్చేసినట్టున్నది.

"పడుకోకపోయావా, ఎల్సే. నాకు కొంచెంపాటి నిద్ర చాలునని నీకు తెలుసుగా ?"

"ఒకటి కనిపెట్టకపోతే పడుకునే ఉండేదాన్ని."

"కనిపెట్టావా ?" అతను ఇంతసేపటికి ఆమెకేసి చూశాడు. వెంటనే అతనికి తాను చేసిన పనికి పశ్చాత్తాపం కలిగింది. ఆమె దగ్గిర సమస్తమూ దాచాడు, వెట్టి చాకిరితో అలిసిపోయిన ఆమె ముఖానికి అడ్డుగోడలాగా అతని మనస్సులో చాలా పేరుకున్నది, దాన్నంతా నిర్దయగా పక్కకు నెట్టేశాడు. "ఇంతకూ నువ్వేం కనిపెట్టావు ?" అని అడిగాడు.

"వంటింటి సొరుగులో పది పడమటి మార్కుల కాగితం జ్ఞాపకంఉన్నదా ?"

జ్ఞాపకం ఉన్నది. ఎల్సే పాత ఎకౌంటు తాలూకు జ్ఞాపకచిహ్నంగా దాన్ని ఉంచుకున్నాడు. ఈ సాయంకాలమే అది అతనికి తిరిగి కనబడింది.

"అది పోయింది," అన్నది ఎల్సే.

ఎదురుగాఉన్న మెర్కిషెన్ ఊఫెర్ మీదినుంచి ఒక సముద్రపు కాకి రెక్కలు కొట్టుకుంటూ లేచి, వికారంగా అరిచి, కాలువ అలవమీద వాలి, రెక్కలు ముడుచుకున్నది.

"ఇంకేం పోయిందో తెలుసా ?"

ఫొటో, అనుకున్నాడు వాల్టర్. పొరపాటుమీద పొరపాటు. ఇలాటి పనికి తగను. ఫొటో తీసుకుని ఉండవలిసిందికాదు—కనీసం ఆ ఫొటో.

"మనపెళ్ళి ఫొటో," అన్నది ఎల్సే. "వంటింటి అలమారు అద్దం వెనక అంటించిన పోస్టుకార్డు ఫొటో. నోటులాగే అదీ మాయమయింది."

"ఆఁ హాఁ ?" అన్నాడతను జాగ్రత్తగా.

"నాకేమీ ఆశ్చర్యం కలగలేదనుకో." ఆమె సైకిల్ హాండిల్‌బారుకు వేళ్ళాడుతున్న సంచీని పరధ్యానంగా నిమిరింది; అందులో చేపలువట్టే గాలం భాగాలున్నాయి: అది చేపపొలుసులతో బిరువెక్కి ఉన్నది. "దీని అంతరార్థమేమిటా అనే నా ఆలోచన. ఆ పడమటి డబ్బు నీకిక్కడ ఎందుకూ పనికి రాదు.

పోతే ఫొటో—దాన్ని జ్ఞాపకార్థం తీసుకున్నావు. దీనికి ఒకటే అర్థం, వాల్టర్. దారుణమైన అర్థం. నువు పారిపోదామనుకుంటున్నావు,'' అన్నదామె రెండు పెద్ద గుటకలు వేసి.

''అయితే, చేపలు పట్టుతూ నేనిప్పు డిక్కడే ఉంటినిగా?'' అన్నాడు వాల్టర్, నరాలు బిగబట్టి.

''దాన్నిబట్టే అనుమానం మరింత రూఢి అవుతున్నది. ఏ అరిష్టం వచ్చినా నువు చేపలు పట్టబోతావు. మొదట్లో అరిష్టాన్ని మరిచిపోవడానికి అలా చేసే వాడివి, ఇప్పుడు నిన్ను నువు కూడదీసుకోవడానికి దీన్ని ఉపయోగించు కుంటున్నావు.''

మృదువుగా గాలి వీచసాగింది. అది మార్క్స్-ఎంగెల్స్ ప్లాట్జ్ మీదుగా వీస్తూ సిమెంటుదుమ్ముకవాసననూ, లారీ చేసే పెద్ద రొదనూ మోసుకొచ్చింది.

''చెప్పు, వాల్టర్. అంతా కలే అను,'' అన్నదామె బొంగురుపోయిన కంఠం వినపడీ వినపడకుండా.

అతను గాలం కమ్మీని రెండు చేతులా బలంకొద్దీ పట్టుకున్నాడు. అది విరగ లేదుగాని, వలయంగా వంగింది. ''కల కాదు, ఎల్సే. కలలో గట్టిగా అరవవచ్చు''

''ఇప్పుడైనా నేను అరవగలను.''

''అరవకు. వినగూడని వాళ్ళు వింటారు. అరిచినవాళ్ళందరి గతీ ఏమయిందో కాస్త జ్ఞాపకం తెచ్చుకో.''

ఎల్సే కాలవ అలవపైన మోచేతు లానించి, ముడుచుకున్న తన చేతుల మీదుగా నీటిలోకి చూస్తూ, మౌనంగా ఉండిపోయింది.

అతనన్నాడు : ''నీకూ తెలుసు, నే నెన్నిసార్లో ప్రయత్నించిచూశాను—సాయంకాలపు ప్రాపగాండా క్లాసులు, పార్టీవాళ్ళ రాజకీయోపన్యాసాలు, ఆయుధాలతో తరిఫీదు, డ్రిల్లు, క్షుద్రమైన వేగుపనులు, ఉత్పత్తి పెరుగుదల, అబద్ధాలు—మళ్ళీ మళ్ళీ అన్నిటినీ సహించాను. కాని ఎప్పుడో ఒకప్పుడు చాలి రాకతప్పదు. అప్పుడా పోలిట్‌బ్యూరోవాళ్ళు చెప్పేది ఒక్క అక్షరం కూడా వినలేవు. ఏ యంత్రంలోనో చెయ్యి దూర్చి విరగగొట్టుకోవా లనిపిస్తుంది గాని మళ్ళీ రైఫిల్ పట్టుకోవాలనిపించదు. కాంటీన్ బార్‌లో ఏ చిల్లరఅధికారి శ్వాసో నీ భుజంమీద బీరువాసన కొట్టుకుంటూ పడినప్పుడు, వాణ్ణి చావగొట్టకుండా నిగ్రహించుకోవ

డానికి బాక్ అంచును గట్టిగా పట్టుకోవలసి వస్తుంది. 'తప్పనిసరి కోటాబా,' 'ప్రొడక్షన్‌ప్రోగ్రాం' అనేమాటలు కంపోజు చెయ్యవలసి వచ్చినప్పుడు గట్టిగా అరవ బుద్ధిపుట్టుతుంది. ఇవన్నీ మనుషుల కోసమే ననుకుంటే ఆశ్చర్యంగా ఉంటుంది."

ఎల్సే దీర్ఘంగా శ్వాస తీసింది. "నాకు తెలుసు. అయితేనేం? వాళ్ళ భాష వేరు, మన భాష వేరు, కాదా? చిల్లరఉద్యోగులకు అందనిది మనలో లేదా? ఇక రైఫిల్‌మాటకు వస్తే, నువు మూర్ఖుడివో, పిరికివాడివో కాకపోతే, దాన్ని అపాయం లేకుండా పట్టలేవా? రాజకీయోపన్యాసాలు నువు వినాలని ఎక్కడున్నది? అంతకంటె మంచి విషయా లాలోచించుకోవచ్చునే!"

ఒక లాంచి పక్కగా స్ప్రీ ప్రవాహానికి ఎదురువెళ్ళింది, దాని ఫ్లడ్ లైట్లు ప్రకాశిస్తున్నాయి. నదిపోలీసులు. షిల్లింగ్ వంతెనకూ, ఓబెర్‌బౌమ్ వంతెనకూ మధ్య నదే సెక్టరు సరిహద్దు, ఈ పోలీసులకు అక్కడ మళ్ళీ పని తగిలి తీరుతుంది.

"వాల్టర్, అప్పుడే నువ్విక్కడ ఉండడం మానావు?" అన్నదామె.

అతను ఊపిరి బిగబట్టి, కీల్‌వంతెనకింద అలల ధ్వని వినిపించిన దాకా వేచి ఉండి, "గోడ," అంటూ తన గాలపుకర్రను అలవకు ఆనించాడు. అతని చేతులు మళ్ళీ వణుకుతున్నాయి. "అస్తమానమూ ఆ గోడే నా కళ్ళముందుంటుంది. ఆ గోడా, దానిముందున్న చావు కందకమూనూ. అవి లేకుండాఉంటే మిగిలినదంతా ఎలాగైనా భరించవచ్చునేమో. కాని ఇదేమిటి—? దీన్ని భరించేటందుకు బలం ఎక్కడినుంచి తెచ్చుకునేటట్టు? వాచ్ టవర్లనుంచా? బంకర్లనుంచా? ముళ్ళతీగె కంచెనుంచా?"

ఎల్సే గుటకవేసింది. "ఒకప్పుడిలా మాట్లాడేవాడివి కాదు."

"అవును. తూర్పు బెర్లిను అప్పటికింకా సజీవంగా ఉండేది. ఇప్పుడు చూడు, ఆ గోడ సమస్తాన్నీ ఎలా చంపేసిందో. వీధులు చస్తున్నాయి, స్క్వేర్‌లు బోసిపోయాయి, ఇళ్ళు నశిస్తున్నాయి, నేలమాళిగలు కుళ్లుతున్నాయి. పిచ్చి మొక్కలు మాత్రం పెరిగిపోతున్నాయి, ఆఁ, శ్మశానాలలో మొక్కలు కూడా ఏపుగానే పెరుగుతున్నాయి."

ఆమె మృదువుగా అన్నది: "నువు పొరబడుతున్నా వనుకుంటాను, వాల్టర్. తూర్పు బెర్లిన్ బాహ్యస్వరూపం తప్ప ఇంకేమీ లేనట్టు మాట్లాడుతున్నావు—

ఖాళీ వీధులూ, బోసిపోయిన స్క్వేర్‌లూ, మొక్కలు పెరిగిన బాంబు గుంటలూ. న్యాయంగా ఆశకు అవకాశంలేని మాట నిజమే. కాని, చుట్టూ ఉండే వాతావరణాన్ని పట్టించుకోకుండా, మనుషులనే నమ్ముకోవడం మంచిదని ఒకప్పుడు నువే నాతో అన్నావు కావా ? నేనా మాట నా గుండెలో దాచుకున్నాను."

"నీ కింకా గుండె అంటూ ఒకటి ఉన్నది. నాలో ఉన్నది గోడరాయి మాత్రమే."

"అలాగే అనుకో పోనీ. దాన్ని ఎక్కడికో ఈడ్చుకుపోతే అది తేలిక అవుతుందా ? కాదు, వాల్టర్. దూరం మోసుకుపోయిన కొద్దీ అది మరింత బరువెక్కుతుంది."

"నాకు తెలుసు. నేను సుఖంకోసం వెళ్ళడంలేదు. తప్పనిసరి అయి పోతున్నాను. విధిలేక పోతున్నాను," అన్నాడతను. అతను బొటనవేలితో తనను నిర్దేశించుకుంటూ, "నాలో ఇంకా మానవత్వం మిగిలిఉన్నది, అది పూర్తిగా నశించి పోదలచక, నన్ను వెళ్ళిపొమ్మని నిర్బంధిస్తున్నది," అన్నాడు.

"ఇక్కడ ఉండే మనుషులు ? వాళ్ళేం చెయ్యాలి ?" అని ఆమె సైకిలు మీదుగా అతనికేసి వంగి అడిగింది.

"నేను ప్రవక్తను కాను. కాని, ఇదిమాత్రం నిజం, ఆరోజు కారోజు గడిచే కొద్దీ మానవత్వం నిలబెట్టుకోవడం మరింత కష్టమవుతుంది," అన్నాడతను.

ఆమె ఉద్రేకం తెచ్చుకుని, "వాళ్ళేం చేస్తున్నదీ నువు సరిగా చూడడంలేదు. వాళ్ళు దగాపడి ఉండిపోవడంలేదు. వాళ్ళూ జీవిస్తూనే ఉన్నారు, కాదా ?" అన్నది.

వాల్టర్ తల ఆడించి, "వాళ్ళు ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. కాని నిజంగా జీవించగలుగుతున్నారా ?" అన్నాడు.

"నీకింకా అర్థం కావడం లేదు."

ఆమె చిరాకుగా తల అటూ ఇటూ తిప్పింది. నిద్రపట్టకపోతే ఆమె తల అలాగే తిప్పుతుంది. వాల్టర్ తప్పుచేసినవాడిలాగా దృష్టి మరొకవేపు తిప్పుకున్నాడు. ఎన్నోరాత్రులు అతను చేపల వేటనుంచి తిరిగివచ్చి, మునివేళ్ళమీద నడుస్తూ వచ్చి చూస్తే ఆమె ఆ స్థితిలో ఉండేది.

ఆమె అన్నది : "యుద్ధం ఆగిపోయినకాలం జ్ఞాపకం తెచ్చుకో. అప్పుడు బెర్లిన్ దాదాపు చచ్చిపోయినట్టు లేదా ? అప్పుడు జీవితం ఎక్కడ ఆరంభ

మయింది, వాల్టర్? శిథిలాలలోనా? ధ్వంసమైన వీధుల్లోనా? తుక్కుకుప్పలతో నిండిన స్క్వేర్‌లలోనా? కాదు, మనలో. అప్పుడు జీవితం ఎక్కడ ఆరంభ మయిందో అక్కడికే తిరిగిపోతుంది ఇలాటి సమయాలలో. చావుకందకం ఎన్నటికీ మానని గాయమే నని ఒప్పుకుంటాను. కాని దానికా పేరు సరయినది కాదని చెప్పగలను, ఎందుకంటే బెర్లిన్ జీవితం మనమే."

"మనం...." అన్నాడు వాల్టర్, మూతికొసలు జార్చుతూ. "ఇక్కడ అందరూ మనలాటివాళ్ళే అయినట్టు మాట్లాడుతున్నావు. ఎవరీ 'మనం'? ఇదొక కలెక్టివ్ మాత్రమే. ఇందులో పార్టీ మనుషులున్నారు; ఇందులో గోడను ఆమోదించే వారున్నారు; ఇది....ఇది జీవితం కాదు. ఇదొక వ్యవస్థ. ఇప్పుడొచ్చి గోడ స్టేటు సరిహద్దయి కూర్చుంది. నువు ముందుకు పోలేవు. చెయ్యదగినది ఒకటే—వెళ్ళి పోవడం."

"బెర్లిను నుంచా?" ఎల్సే తన భుజాలు రుద్దుకున్నది. ఆమెకు చలి వేస్తున్నది.

"నేనూ అలాగే అనుకున్నాను. ఇది తూర్పుబెర్లిను, అవతల మరొక ళ్ళున్నారు అనుకునేవాణ్ణి. కాని పరిస్థితి వికటించింది. గోడ వచ్చినప్పటినుంచీ అరాజకమై పోయింది. నువు పీల్చేగాలిలోనే భయంఉన్నది. రొట్టె నోటపెట్టుకుంటే సిమెంటు రుచి: ఎక్కడికైనా వెళ్లు, సిమెంటు నిన్ను వదలదు. ఇళ్లే నీమీద ఆరోపణలు చేస్తాయి, రాళ్లే నిన్ను అరెస్టు చేసేలా కనిపిస్తాయి, స్క్వేర్‌లు నీ నేరాన్ని రుజువుచేసినట్టూ, నీ ఇంటి నాలుగు గోడలే నిన్ను ఖైదుచేసినట్టూ కనిపిస్తాయి. ఎంతగా ఒంటరిగా ఉన్నా అనుమానం నిన్ను వెన్నాడుతూనే ఉంటుంది. ఇప్పుడు చెప్పు తేడా ఏమిటో, పరిధులేవో, అవతలివాళ్లూ ఇది బెర్లిన్ మాత్రమే అనుకోవడం సాధ్యమేమో: లాభంలేదు, ఎల్సే. ఇక్కడ దేనినైనా వదిలించుకోవా లనుకుంటే మొత్తంగా అంతా వదిలించుకోవలిసిందే."

"మరి పడమటి బెర్లిన్‌లోనో? అక్కడ ఏముం దనుకుంటున్నావు?" అని ఎల్సే సంకోచిస్తూ అడిగింది.

అతను గాలంతాడు చేదుకుంటూ, "ఏమీలేదు. నాకు గాలిమార్పు చాలు. ఒక్కసారి స్వేచ్ఛగా గాలిపీలిస్తే అదే చాలు," అన్నాడు.

"ఎలా బతుకుతావు?"

"ఒకరు బలాత్కరించకపోతే ఏదైనా చెయ్యగలను," అంటూ అతను గాలం కర్రను జాగ్రత్తగా ఊడదీసి, వలతోబాటు సైకిలుకు కట్టాడు. "పేపర్లు అమ్ముతానేమో. ఏదో ఒకటి చూడాలి.''

చలికి బిగుసుకుపోతూ ఎల్సే తన కోటు కాలరు ఎగలాగుకుని, "ఏమైనా అక్కడ నీకోసం చూసేవాళ్లెవరూ ఉండరు,'' అన్నది.

"ఉండరు. మనవంటివాళ్ల కోసం చూసేవాళ్లు గోడదగ్గిర నిలబడే ప్రజా పోలీసులు మాత్రమే," అన్నాడతను.

ఆమె అతనికేసి పక్కనుంచి చూస్తూ గుటకవేసింది. "వాళ్ళనుంచి అపాయం లేకుండా తప్పించుకునే మార్గం నీకు తెలుసా?"

"నా కేమీ తెలీదు. కాని ఇక్కడ నాకు అపాయం లేదు గనకనా?'' అన్నాడతను.

ఆమె మాట్లాడలేదు.

గాలంకర్రను కట్టేసేపని అయిపోయింది. అతను తనలాగుకు అమర్చుకున్న సైకిలుక్లిప్పులు సరిగాఉన్నదీ, లేనిదీ చూసుకున్నాడు; గాలి ఎలాఉన్నదీ చూశాడు. అతను భయపడ్డట్టుగానే, ఉదయానికి ముందు వచ్చే చల్లదనం ప్రారంభమయింది

"సారీ, ఎల్సే. చీకటిని వినియోగించుకోవాలి.''

"చీకటి, అవునవును. దాన్ని నువు ఉపయోగించుకోవాలి,'' ఆమె నీరసంగా తన చేత్తో నుదురు తడుముకున్నది. "చిత్రం, నీకు జరుగుబాటు కానప్పుడే ఎడబాటు వస్తుందనుకుంటావు నువ్వెప్పుడూ.''

నెమ్మదిగా అతను సైకిలును ముందుకుతోస్తూ, "ఇలా అవుతుందని ఎన్నడూ అనుకోనుకూడా లేదు," అన్నాడు.

"ఒకవేళ .... ఒకవేళ తప్పు మనదేనేమో, వాల్టర్?'' ఆమె గొంతు బొంగురుపోయింది.

"మన తప్పా?!" డైనమో స్విచాన్ చేసేటప్పుడతని చేతులు వణికాయి. కంగారుపడకు, కంగారుపడకు, అని అతను తనలో అనుకున్నాడు.

అతను సైకి లెక్కి బయలుదేరాడు. సైకిలు దీపంకాంతి, దుమ్ముకొట్టుకుని ఉన్న ఆమె పాదరక్షల మీదినుంచి ఇంటిగోడమీదికి వెళ్ళి, అకస్మాత్తుగా పరిగెత్త సాగింది. కుళ్ళు కొయ్య వాసనా, అడవిరోజాపూల వాసనా అతనికి ఎదురొచ్చింది.

నీడలు నీటిపైన ఏటవాలుగా పడుతూ, వెనక్కు పరిగెత్తి చీకటిలో లీనమై పోయాయి. కాలువ అలవ ఎగిరెగిరి పడుతూ పక్కగా పరిగెత్తుతున్నది. చెత్త డబ్బా అతివేగంగా అతని కెదురు వచ్చింది. ఇప్పటికతనికి అర్థమయింది. తాను పారిపోతున్నాడు.

మరొక్కసారే అతను ఆగవలిసి వచ్చింది. ఈల్ ఇంకా తన వెంటనే ఉన్నదన్న సంగతి గెట్రౌడెన్ వంతెన మీద అతనికి జ్ఞాపకం వచ్చింది.

అతను సైకిలు ఆపి, కిందికి దిగకుండానే ఈల్‌ను పైకి తీశాడు. దాని జీవితేచ్ఛ సడలలేదు. అతని చేతిలో అది బలంగా కొట్టుకున్నది.

వాల్టర్ దానిమీద మూడుసార్లు ఉమ్మివేసి, అలవ మీదుగా విసిరివేశాడు. నల్లని ఆకాశంలో దాని పొట్ట క్షణంపాటు తెల్లగా మెరిసింది. దాని తోక అప్పుడే ఆడుతున్నది. అద్దంలాటి నీటిలోకి అది నిశ్శబ్దంగా మునిగిపోయింది.

## వి వ ర ణ లు

హో : హాండెల్స్ ఆర్గనైజేషన్ అన్న మాటకు సంగ్రహరూపం. ఈ సంస్థ తూర్పు జర్మనీలో ప్రభుత్వ నిర్వహణకింద ఉండే దుకాణాలనూ, హోటళ్లనూ నడుపుతుంది. అలాటివాటిలో ఒకటి ఇక్కడ చెప్ప బడింది.

ఎస్-బాన్ : ష్నెల్‌బాన్‌కు సంగ్రహరూపం. బెర్లినులో గల రెండు రైల్వే లలో ఒకటి. తూర్పు బెర్లినులోనూ, పడమటి బెర్లినులోనూ కూడా ఈ రైల్వేను తూర్పు జర్మను రైల్వేశాఖవారే నడుపుతారు.

ఎఫ్.డి.జె. : ఇది తూర్పు జర్మను కమ్యూనిస్టు ఆర్గనైజేషను. "స్వతంత్ర జర్మను యువకులు" అన్న సంస్థకు పొడి అక్షరాలు.

యు - బాన్ : ఊంటర్‌గ్రూండ్‌బాన్ (అండర్‌గ్రౌండ్ రైల్వే) కు సంగ్రహ రూపం. ఇదే బెర్లినులోని రెండవ రైల్వే. పశ్చిమ బెర్లిను రవాణాశాఖ నడిపే ఈ రైల్వే పశ్చిమ బెర్లినులో మాత్రమే ఉన్నది. అయితే దీని తాలూకు కొద్ది లైనులు తూర్పు బెర్లిన్ ప్రాంతంగా కూడా పోతాయి. అందుకే మనుషులు తప్పించుకు పోకుండా కట్టుదిట్టాలు.